క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల పంపిణీ


ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న సిబ్బంది

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్యపుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, సీఆర్పీలు నాగార్జున్, గురుస్వామి, మెసెంజర్ అంజన్, తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థికి సన్మానం


విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : నీట్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థి బి.మేఘనను హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో మంగళవారం యాజమాన్యం, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేఘన నీట్‌లో 632/720 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 45,675 వ ర్యాంక్, ఈడబ్ల్యూసీ క్యాటగిరిలో 5,959వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏఈఓలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి


ఏడీఏ రాజగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఈఓలు

కోదాడరూరల్ : గ్రామాల్లో రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తున్న ఏఈఓలను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పలువురు ఏఈఓలు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో ముగ్గురు ఏఈఓలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ కోదాడ ఏఈఓలు.. ఏడీఏ రాజగోపాల్‌కు మంగళవారం కాపుగల్లు రైతు వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని ఏఈఓలు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేత


సువార్తకు ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మోతె : మండల పరిధిలోని అన్నారిగూడెం గ్రామంలో పడిశాల సువార్తకు చెందిన పూరిల్లు సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో గూడు లేక నిరాశ్రయురాలైన ఆమెకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు మేదరమెట్ల వెంకటనారాయణ, మాజీ సర్పంచ్‌లు గుడిపుడి వెంకటేశ్వరరావు, దున్నపోతుల ఆదినారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ఘనంగా ఆకుపూజ


ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఆకుపూజను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, అర్చకులు ముడుంబై మనోహరాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వాగు అధ్వానం.. వానొస్తే ఆగమాగం


నడిగూడెంలోని బీసీ కాలనీలో వాగులో పేరుకుపోయిన చెత్తాచెదారం


ఎస్సీ కాలనీ వద్ద దుర్వాసన వెదజల్లుతున్న వాగు

- చెత్తాచెదారంతో పూడిన వాగు
- పలుచోట్ల భరించలేని దుర్వాసన
- వానాకాలంలో నీట మునుగుతున్న లోతట్టు ప్రాంతాలు
- వంతెనల నిర్మాణంలో నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నడిగూడెం : మండల కేంద్రంలో వాగు అధ్వానంగా తయారైంది. చెత్తాచెదారంతో నిండింది. వాగు పూడిపోవడంతో పాటు ఆక్రమణకు గురికావడంతో లోతట్టు ప్రాంతాలు వర్షాకాలంలో నీట మునుగుతున్నాయి. బస్టాండ్ వద్ద గల చౌదరి చెరువు అలుగు నుంచి, అదేవిధంగా బాలుర ఉన్నత పాఠశాల వెంట ఉన్న వాగు నుంచి బీసీ, ఎస్సీ కాలనీల మీదుగా దిగువ ప్రాతంలో ఉన్న సారంగేశ్వరస్వామి చెరువులోకి వర్షపు నీరు వెళ్తుంది. కానీ వాగు లోతు లేకపోవడంతో లోతట్టు ప్రాంతమైన ఎస్సీ కాలనీలోని పలు వీధులు వర్షాకాలంలో జలమయం అవుతున్నాయి.

వెదజల్లుతున్న దుర్వాసన..

బస్టాండ్ ప్రాంతం నుంచి బీసీ కాలనీ మీదుగా ఎస్సీ కాలనీ వరకు, అలాగే బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఎస్‌బీఐ బ్యాంకు, ఎస్సీ కాలనీ మీదుగా చెరువు వద్దకు వాగులో వ్యర్థాలు పడేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్లల్లోంచి వచ్చే మురుగు నీరు, చికెన్ దుకాణాల వ్యర్థాలు వాగులో వేస్తుండడంతో దుర్వాసన వస్తోంది. దీంతో సీజనల్‌గా అనేక మంది రోగాల పాలవుతున్నారు. ఈగలు, దోమలు, విష సర్పాల సంచారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కంపచెట్లమయంగా..

గతంలో సర్పంచ్‌గా పనిచేసిన నూనె ఇందిర ప్రత్యేక నిధులతో వాగులో పూడిక తీయించారు. కంపచెట్లనూ తొలగించారు. ప్రస్తుతం వాగును పట్టించుకోకపోవడంతో మళ్లీ చెట్లు పెరిగి వాగు పూర్తిగా కంపచెట్లమయంగా మారింది. పలు చోట్ల పూడింది. నీరు కింద చెరువులోకి పోకుండా ఎస్సీ, బీసీ కాలనీల్లో నిలుస్తోంది. దీంతో వర్షాకాలంలో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

మరిచిన వంతెనల నిర్మాణం..

వాగు పరిధిలోని పలు కాలనీల్లో రాకపోకలకు వంతెనల నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత అధికారులు గూనలు ఏర్పాటు చేశారు. కానీ వంతెనల నిర్మాణం మరిచారు. దీంతో ఆ గూనలు నిరుపయోగంగానే ఉంటున్నాయి. గూనలు వాగులో వేసిన తర్వాత ప్రజల రాకపోకలకు మరీ ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే వాగును పూర్తి స్థాయిలో లోతు తీసి, లైనింగ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


వాగులో నిరుపయోగంగా గూనలు

ఇంటి ముందు దుర్వాసన వెదజల్లుతోంది



మా ఇంటి ముందు ఉన్న వాగు నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగల సంచారంతో విష జ్వరాలు వస్తున్నాయి. రాత్రి సమయంలో విష సర్పాలు సంచరిస్తున్నాయి. వాగు పొంగితే ఇంట్లోకి నీరు చేరుతోంది.

– కుంభం కోటయ్య, నడిగూడెం

అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి



మా ఇంటి వెంట ఉన్న వాగు కంపచెట్లమయంగా మారింది. పలు చోట్ల పూడింది. దీంతో వర్షాకాలంలో ఇళ్లల్లోకి నీరు చేరుతున్నది. ఈ వాగుతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి వాగు సమస్యను పరిష్కరించాలి.

– బొల్లం పద్మ, నడిగూడెం

భూములు కాపాడాలని ఆర్డీఓకు వినతి


ఆర్‌డీఓ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, దళితులు

హుజూర్‌నగర్ : నిరుపేదల భూములు కాపాడాలని మేళ్లచెరువు మండలం వేపలమాదారానికి చెందిన పలువురు దళితులు మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆర్‌డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వేనంబర్ 141లో గల సుమారు 40 ఎకరాల భూమిని 60 కుటుంబాలకు చెందిన నిరుపేద దళితులు బాగు చేసుకుని సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆ భూమిపై కన్నేసిన కొందరు పెద్దలు తమను బెదిరించి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. నిరుపేదలైన తమకు పట్టాలు ఇప్పించాలని ఆర్‌డీఓను వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు ప్రసాద్, బాలచంద్రుడు, రామారావు, శ్రీనివాసులు, నాగరాజు, రాణి, విశాఖ, నాగరాజు, నరేష్, స్వాతి, జయేంద్ర, గోపి, తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి


వినతిపత్రం అందజేస్తున్న పీఓడబ్ల్యూ కార్యదర్శి రేణుక తదితరులు

కోదాడరూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం గ్రామాలకు బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. ఈమేరకు మంగళవారం కోదాడ డిపో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం హర్షించదగిన విషయమని కానీ అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణాలతో రద్దీ బాగా పెరిగిందని దీంతో సరిపడా బస్సులు లేక ఇటు మహిళలు, పురుషులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. లక్ష్మి, పావని, రేష్మ, స త్యమ్మ, మరియమ్మ, మాలాంబీ, మల్లేశ్వరి, నాగమణి ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ చరమందరాజు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఎలా ఉండాలో వివరించారు. సైబర్ నేరగాళ్లు నమ్మించి మీ వివరాలు సేకరించి వాటి ద్వారా మీ పేరు మీద సిమ్ కార్డు, బ్యాంక్ అక్కౌంట్ తీసుకొని ఆన్‌లైన్ మోసాలు చేస్తారని తెలిపారు. ఇప్పటికే హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలో 51 కేసుల్లో దాదాపు రూ.96 లక్షలు పోగొట్టుకున్నారని చెప్పారు. బాధితులు సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కాల్ చేయడంతో బ్యాంకుల్లో నగదును ఫ్రీజ్ చేయడం జరిగిందని తెలిపారు. కోర్టు ఉత్తర్వుల మేరకు రూ.26 లక్షల రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. కావున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఘనంగా తిరుపతమ్మ కల్యాణం


బక్కమంతులగూడెంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాతలు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యాహవచనం, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చనలు గావించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తదనంతరం లక్ష్మీ తిరుపతమ్మ మూలవిరాట్ విగ్రహ దాతలు ఆకుల రాము, రజిని దంపతులు, బాచిమంచి కొండయ్య, వేముల రవి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సిలివేరు నాగేశ్వరరావు, నాగమణి దంపతులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం నిర్వహించడం అభినందనీయం


అన్నదానం నిర్వహిస్తున్న దాత, నిర్వాహకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విప్పకుంట్ల జగన్‌మోహన్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని గడ్డం సూర్యారెడ్డి మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెక్కెర చిన్నపరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అన్నదానం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, కోట తిరపతయ్య, హనుమంతరావు, గడ్డం వెంకట సూర్యారెడ్డి, వాడపల్లి రవికుమార్, బాల్తు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇళ్లు కేటాయించాలి

హుజూర్‌నగర్ : అర్హులైన ప్రైవేట్ టీచర్లకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఆ సంఘం నాయకులు మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆర్‌డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.నాగరాజు, ఎం.నాగరాజు, పి.ప్రకాష్, విజయ్‌కుమార్, కవిత, లింగయ్య, నవీన్ చారి, కోటేశ్వరరావు, హేమలత, రాహుల్, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుండాలమ్మ ఆలయ వార్షికోత్సవం


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

గరిడేపల్లి : మండల కేంద్రంలో గుండాలమ్మ తల్లి ఆలయ రెండవ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి గుండాలమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అర్చకుడు కొంపెల్లి కృష్ణశాస్త్రి, ఎంపీపీ సుజాతాశ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, త్రిపురం అంజన్‌రెడ్డి, బండా నర్సిరెడ్డి, పోలిశెట్టి ఆంజనేయులు, కడియం స్వప్న, వెంకట్‌రెడ్డి, నారాయణ, కృష్ణ, పూజారి సతీష్‌శర్మ, కాశయ్యగౌడ్, సైదులు, నవీన్, గౌతమ్, నాగరాజు, చంద్రయ్యగౌడ్, సైదులు, వీరాంజనేయులు, అనిల్, నాగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఎంపీపీ సుజాతాశ్రీనివాస్‌గౌడ్

శివుడికి ఘటాభిషేకం


నీటిలో దర్శనమిస్తున్న శివుడు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శివాలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారికి ఘటాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, రుష్యశృంగ పూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు జల బిందెలతో ఆలయానికి తరలివచ్చి శివుడికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వేదమూర్తులు శ్రీరామకవచం సుబ్రహ్మణ్య శాస్త్రి, ఇరువంటి సత్యనారాయణశాస్త్రి, కొంపెల్లి కృష్ణశాస్త్రి, శివాలయం చైర్మన్ నలజాల రామారావు, గట్టిగొప్పుల కృష్ణారెడ్డి, ఎడ్ల అంజన్‌రెడ్డి, రావుల ముత్యాలు, కొలిపాక రాము, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

- డీపీఓ సురేష్‌కుమార్


ఆకుపాములలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న డీపీఓ సురేష్‌కుమార్

మునగాల : ప్రభుత్వ పాఠశాలలు బుధవారం నుంచి పునః ప్రారంభం కానున్నందున జిల్లాలోని పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ మండల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మునగాల మండలంలోని ఆకుపాముల, కోదండరామాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్యం పనులను ముమ్మరం చేయాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి ఎస్.భూపాల్‌రెడ్డి, కోదండరామాపురం, ఆకుపాముల గ్రామపంచాయతీ కార్యదర్శులు కవిత, నాగరాజు, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

కౌలు రైతులకు భరోసా కల్పించాలి

పాలకవీడు : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు భరోసా కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి. ధనుంజయనాయుడు డిమాండ్ చేశాడు. మంగళవారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రయోజనాల కోసం చేసిన వాగ్దానాలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర, బోనస్ అమలు చేయాలన్నారు. ఆయన వెంట ఆ పార్టీ రైతు సంఘం జిల్లా సభ్యుడు కత్తి శ్రీనివాసరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మిర్యాలగూడ : మహిళల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిర్యాలగూడ మండలంతో పాటు అడవిదేవులపల్లి మండలాలకు చెందిన 41 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, తహసీల్దార్లు హరిబాబు, సురేష్‌కుమార్, ఆర్‌ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, కౌన్సిలర్లు గంధం రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి


మునగాల : నేలమర్రిలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మునగాల : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నేలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీధర్ అన్నారు. మంగళవారం మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేలమర్రిలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు కోరారు. ఆయా కార్యక్రమాల్లో సీఆర్‌పీ రాంపంగు వెంకటేశ్వర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.నరేష్, సుధీర్, మోహన్, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.స్వరూపరాణి, ఎస్.సునీత, సీహెచ్.నిర్మల మహిళా సంఘాల అధ్యక్షులు షేక్ జాన్‌బీ, పి.నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిపురంలో అంగన్‌వాడీ బడిబాట


నడిగూడెం : సిరిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురంలో మంగళవారం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో ర్యాలీ తీశారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం, 1, 2, 3 కేంద్రాల కార్యకర్తలు నిర్మల, శ్రీలక్ష్మి, శైలజ, ఆయాలు లలిత, పద్మ, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను తొలగించరూ


సాగర్ ఎడమకాలువ కట్టపై దారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

మునగాల : మండల కేంద్రం శివారులో సాగర్ ఎడమకాలువ కట్టపై దారి మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని, వాటిని తొలగించాలని పరిసర ప్రాంత రైతులు కోరుతున్నారు. అయితే ఎడమ కాలువ కట్టల మరమ్మతులో భాగంగా కాంట్రాక్టర్ కట్టను వెడల్పు చేశారు. దీంతో కాలువ కట్టపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా పనులు పూర్తిచేయడంతో అప్పటి విద్యుత్ స్తంభాలు దారి మధ్యలోనే ఉండిపోయాయి. దీంతో ఈ కట్టపై రైతుల ట్రాక్టర్లు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. ప్రమాదకరంగానూ ఉన్నాయి. ఈ విషయమై స్థానిక ఎన్ఎస్పీ ఉన్నతాధికారులను వివరణ కోరగా విద్యుత్ స్తంభాలను తొలగించే బాధ్యత తమది కాదని, ట్రాన్స్‌కో శాఖ వారిదేనని తెలిపారు. ఇక ఆ పని తమది కాదని ట్రాన్స్‌కో శాఖ సిబ్బంది చెబుతున్నారు.

విత్తన ధరల వివరాలు బోర్డుపై ప్రదర్శించాలి

మిర్యాలగూడ : ఫర్టిలైజర్ దుకాణాదారులు తమ షాపు ఎదుట విత్తన ధరల స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని ఏడీఏ నాగమణి అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఆమె సీపీలు, ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, నాసిరకం విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన విత్తనాల దుకాణాదారుల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. రసీదు తీసుకొని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. లాట్ నంబర్లు, విత్తన ప్యాకెట్ లేబుళ్లను చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఓ సరిత తదితరులు ఉన్నారు.

బడికెళ్లేందుకు రెడీ



పాఠశాలలు బుధవారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. నోట్ పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు అన్నీ సిద్ధం చేసుకుంటూ చిలుకూరు మండల కేంద్రంలో విద్యార్థులు ఇలా కనిపించారు. – చిలుకూరు

హరితహారానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం


నాగిరెడ్డిగూడెంలోని నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు


పాలకవీడులో..

పాలకవీడు : హరితహారం కార్యక్రమంలో నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిస్తే కొద్దిరోజుల్లో మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు సమాయత్తం అవుతున్నారు. పాలకవీడు మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో గల నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ఒక్కో నర్సరీలో ఐదు నుంచి పదివేల మొక్కలు పెంచుతున్నారు. నాలుగు దశాబ్దాల కాలం పాటు జీవించే వృక్షజాతి మొక్కలు, రైతులకు అవసరమయ్యే పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు, ఇతర మొక్కలు నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి. మొక్కలు నాటేందుకు ఇప్పటికే అధికారులు గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలు, రోడ్ల వెంట, ఇతర అనువైన స్థలాలను గుర్తించారు. గతంలో మొక్కలు చనిపోయిన ప్రదేశాల్లోనూ మొక్కలు నాటాలని గ్రామ అధికారులకు సూచనలు చేస్తున్నారు. మండలంలో హరితహారంలో భాగంగా నాటేందుకు నర్సరీల్లో మొత్తం 1 లక్ష 90 వేల మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీఓ దయాకర్ తెలిపారు.